అన్నదాతకు 'గుర్తింపు' గుబులు!

- ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసిన సర్కార్
- కౌలు రైతుల గురించి ప్రస్తావించని వైనం
- వేధిస్తున్న సర్వర్ సమస్య



రైతుసేవా కేంద్రంలో రైతుల వివరాలను నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

దెందులూరు: రైతులకు కూటమి ప్రభుత్వం అందోళనకు గురిచేస్తోంది. రైతులందరూ విధిగా 11అంకెల గుర్తింపు కార్డు తీసుకోవాలంటూ కొత్తగా మెలిక పెట్టింది. ఈనెలాఖరులోగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని ఒత్తిడి ఉండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అయితే సొంత భూములున్న రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు పేర్కొన్న ప్రభుత్వం కౌలు రైతులు గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడం విమర్శలకు తావిస్తోంది. గుర్తింపు కార్డు ఉంటేనే బ్యాంకు రుణాలు, సబ్సిడీల వర్తింపు, పీఎం కిసాన్, పెట్టుబడి సాయం తదితర పథకాలు అందుతాయని ప్రభుత్వం చెబుతుంది. దీంతో వ్యవసాయ సిబ్బంది రైతు విశిష్ట గుర్తింపు కార్డు నమోదులో బీజీగా ఉన్నారు. అయితే సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో రైతులు కూడా అందుబాటులో లేక నమోదు ప్రక్రియ ఆలస్యమవుతోంది. పలు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు.

నియోజకవర్గంలో నమోదైన రైతుల వివరాలు

దెందులూరు	6577
పెదపాడు	6215
ఏలూరు రూరల్	2575
పెదవేగి	8207

విశిష్ట నంబరుతో ఎన్నో ఉపయోగాలు

రైతులకు ప్రభుత్వాలు వివిధ సందర్భాల్లో రాయితీలు అందజేయడమే కాకుండా అనేక పథకాలు అమలు చేస్తాయి. ప్రత్యేక గుర్తింపుకార్డు ఉంటే పీఎం కిసాన్ నగదు జమ చేయడంతో పాటు విత్తనాలు, ఎరువులపై రాయితీలు, పంటల బీమాతో పాటు కనీస మద్దతు ధర కల్పించడం, రాయితీపై యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు దిగుబడులు కొనుగోలు చేయడంతో పాటు రాయితీపై అందజేసే వ్యవసాయ పరికరాలు అందజేయడం తదితర అనేక ఉపయోగాలు రైతులకు చేకూరతాయి.

"రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందే



విశిష్ట గుర్తింపుకార్డు నమోదును రైతులు విధిగా చేయించుకోవాలి. అయితే ఇంకా సమయం ఉన్నందున రైతులు ఆందోళనకు గురికావద్దు. పూర్తి వివరాలతో రైతులు గుర్తింపు కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ప్రస్తుతం సొంత భూములున్నవారు తప్పనిసరిగా చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

– వై. సుబ్బారావు, అసిస్టెంట్ డైరెక్టర్, వ్యవసాయ శాఖ

జాతర ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



జాతర ఏర్పాట్లపై సమీక్షిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

భీమడోలు: భీమడోలులోని గ్రామ దేవతల జాతర మహోత్సవ వేడుకలను శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ఆధ్యాత్మిక భావనతో ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులకు భక్తులు సహకరించాలని ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ అన్నారు. భీమడోలులో ఈనెల 8, 9వ తేదీల్లో జరిగే జాతర ఏర్పాట్లను సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్‌లతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. వారికి పలు సూచనలు చేశారు. అమ్మవార్ల ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్‌పోస్ట్ వద్ద సిబ్బందితో జాతర బందోబస్తుపై సమీక్షించారు. శ్రీమద్దిరామమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీగంగానమ్మ అమ్మ, శ్రీపోతురాజుల జాతర ఉత్సవంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రశాంతంగా జరిగేలా పోలీస్ సిబ్బంది తమ వంతు కృషి చేయాలన్నారు. జాతర కమిటి అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు, పోలీసులు, జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గణపవరంలో గర్భిణులకు పౌష్టికాహారం కిట్లు అందజేస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: ప్రస్తుత పరిస్థితుల్లో చిన్నారుల నుంచి వృద్ధులకు వరకు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని గణపవరం పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ అన్నారు. శుక్రవారం గణపవరం -3 సచివాలయం పరిధిలోవిలేజ్ హెల్త్ న్యూట్రిషన్ అండ్ శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆరోగ్య సూత్రాలు, ఆరోగ్య నియమాలు వివరించారు. ప్రతీ ఇంటింటా ఎన్‌సిడి 3.0 సర్వేపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


రాచూరులో ఘనంగా పల్లాలమ్మ ఉత్సవాలు



విశేష అలంకరణలో పల్లాలమ్మ

ఉంగుటూరు: రాచూరు గ్రామ దేవత పల్లాలమ్మ ఆలయ 18వ వార్షిక మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి 11 రకాల విశేష ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. ముందుగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, కలశస్థాపన, రక్షాబంధన వంటి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా వేణుగోపాలస్వామి ప్రతిష్టా మహోత్సవాలు



వేణుగోపాలస్వామి ఆలయం

గణపవరం: మండలంలోని బువ్వనపల్లిలో నూతనంగా నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఆలయ నిర్మాణానికి మాజీ ఎంఎల్‌ఏ పుప్పాల వాసుబాబు సోదరులు రూ.3లక్షలు, ప్రముఖ దాత సంకు పుల్లయ్య రూ.3లక్షలు అందజేయగా మిగిలిన దాతలు, గ్రామస్తుల విరాళాలతో పాత ఆలయం తొలగించి, ఈనూతన ఆలయాన్ని నిర్మించారు. ప్రతిష్టా మహోత్సవాల ప్రారంభ రోజైన శుక్రవారం వేదపండితుల వేదమంత్రోచ్చారణలతో గ్రామం పులకించిపోయింది. దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన జరుగుతుందని ఉత్సవ కమిటి సభ్యులు తెలిపారు.

బంగారం.. నగదు అపహరణ



విజయరాయిలో బీరువా తాళాలు పగుల గొట్టి దొంగతనం చేసిన దృశ్యం

పెదవేగి : ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు బీరువా తాళాలు పగుల గొట్టి బంగారం నగదు దొంగిలించుకుపోయినట్లు పెదవేగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పెదవేగి ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం విజయరాయి గ్రామానికి చెందిన గంగిరెడ్ల సాయిబాబు కుటుంబ సభ్యులు ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం నిడదవోలులో ఓ కార్యక్రమానికి హాజరై, తిరిగి 7వ తేదీ ఉదయం వచ్చిచూసేసరికి గుర్తు తెలియని వ్యక్తులు బీరువా తాళాలు పగలగొట్టి అందులో ఉన్న మూడు కాసుల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదును అపహరించుకుపోయినట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సాయిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

తలసేమియా బాధితులకు సాయం



జేసీ ధాత్రి రెడ్డికి డీడీని అందజేస్తున్న మహిళలు

ఏలూరు(మెట్రో): తలసేనియా బాధితులకు హేలాపురి మహిళలు శుక్రవారం సాయం చేశారు. ఇంటివద్ద పిండివంటలు స్వయంగా తయారుచేసి ఆశ్రమ మెడికల్ కాలేజ్ ఆవరణలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా వచ్చిన సొమ్ములకు, మహిళలు సేకరించిన సొమ్మును జత చేసి మొత్తం రూ. 75,008లను తలసేమియా బాధితుల సహాయార్థం జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి డీడీ రూపంలో అందజేశారు.

చేపల చెరువులకు అక్రమంగా నీటిని తరలిస్తే చర్యలు



గోదావరి కాల్వను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుమతి, అధికారులు

దెందులూరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గోదావరి కాలువ నీరు చేపల చెరువులకు అక్రమంగా వెళ్లకుండా మండల అధికారులు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని దెందులూరు తహసీల్దార్ బీ.సుమతి తెలిపారు. శుక్రవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల మండల అధికారులతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు వివరించారు. గోదావరి కాలువ నీరు శివారుసాగు భూములకు అందేల కృషి చేయాలన్నారు. వెంటనే దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ సుబ్రమణ్యం మండల వ్యవసాయ శాఖ అధికారి దామా వెంకటేశ్వర్లు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, మత్స్యశాఖ ,విద్యుత్ శాఖ అధికారులు పోతునూరు వీఆర్‌ఓ రామచంద్రరావులు కాల్వ వెంబడి అన్ని తూములు వద్ద తనిఖీలు నిర్వహించారు. ఇరిగేషన్ లస్కర్లు పగడ్బందీగా విధులు నిర్వహణ చేయాలన్నారు. కాలువ నీరు ఆయకట్టు చివరి భూములకు తప్పకుండా నీరు సరఫరా చేయాలని ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. వీఆర్వోలు విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన వారిపై ఫిర్యాదులు వచ్చిన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

పీ 4 సర్వేలపై అవగాహన కల్పించాలి



భీమడోలులో సర్వేపై సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి



దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో పీ-4 శిక్షణ ఇస్తున్న దృశ్యం

భీమడోలు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ- 4 సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత గ్రామ సచివాలయాల ఉద్యోగులపై ఉందని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. భీమడోలు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పీ-4 సర్వేపై గ్రామ సచివాలయ ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈవోఆర్‌డీ ఏ.సుందరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి పీ-4 సర్వేను పారదర్శకంగా అమలు చేయాలని కోరారు. ఈ సర్వేలో వారి కుటుంబ ఆర్థిక, సామాజిక స్థితిగతులను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోలు మురళీ, తనూజ, జయరామకృష్ణ, మహిళా కానిస్టేబుల్స్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పీ–4 సర్వేపై శిక్షణ

దెందులూరు: ప్రభుత్వం నూతనంగా ప్రారంభించనున్న పీ-4 సర్వేపై దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో శ్రీదేవి ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీదేవి మాట్లాడుతూ సర్వే పక్కాగా జరగాలని తెలిపారు. ఇంటిలోని వారు లేకపోతే మరోసారి వెళ్లాలని తెలిపారు. వలస వచ్చిన వారు ఉంటే కొత్త సచివాలయంలో నమోదు చేయాలన్నారు. వాహనం, విద్యుత్ వంటి వాటి వివరాలు పరిశీలించి నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రమణారావు, భీమరాజు అన్ని గ్రామాల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘ నాయకులపై కేసు కొట్టివేత

ఏలూరు (టూటౌన్): 2024 నవంబర్ నెలలో సర్టిఫికెట్లు ఇవ్వలేదన్న కారణంతో చేబోయిన అచ్యుత్ అనే విద్యార్థి ఎస్‌విఆర్‌కె కళాశాలలో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడు. ఆ సందర్భంలో విద్యార్థికి న్యాయం చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ, వైఎస్సార్‌ఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కళాశాల వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ నేపథ్యంలో యాజమాన్యం తప్పుడు ఆరోపణలతో ఏలూరు త్రీటౌన్‌లో విద్యార్థి సంఘ నాయకుల పై కేసు పెట్టింది. ఆరోపణలు రుజువు కానందున ఏలూరు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు కేసును కొట్టివేసిందని నాయకులు తెలిపారు.

మురుగు నీరంతా రోడ్డుపైనే...

ప్రమాదాలకు నెలవుగా మారిన వైనం



బీసీ కాలనీలో ఆక్రమణకు గురైన డ్రెయిన్

భీమడోలు: మండలంలోని గుండుగొలను బీసీ కాలనీలో ఓ కూటమి కార్యకర్త మురుగునీరు వెళ్లే డ్రెయిన్ ఆక్రమించుకున్నాడు. దీంతో మురుగునీరంతా రత్నాపురం రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈ క్రమంలో డ్రెయిన్ల ఆక్రమణలు తొలగించాలని, మురుగునీరు సక్రమంగా కిందకు పారేలా తగు చర్యలు తీసుకోవాలని కాలనీకి చెందిన రెడ్డి శివ పంచాయతీ అధికార్లకు ఫిర్యాదు చేశారు. ఏన్నో ఏళ్లుగా మురుగునీరంతా డ్రెయిన్ వెంబడి కిందకుపారేది. అయితే ఆరు నెలలుగా కూటమి కార్యకర్త తన ఇంటి ముందు నుంచి వెళ్లే మురుగు డ్రెయిన్ ఆక్రమణ కావడంతో రోడ్డుపైన నీరు నిలిచిపోతుంది. దీంతో ద్విచక్ర వాహనచోదకులు, పిల్లలు, వృద్ధులు ప్రమాదాలు బారిన పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని రెడ్డి శివ పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు. ఈ సమస్యపై గ్రామ పంచాయతీ కార్యదర్శి వీవీ మురళీ, ఈవోఆర్‌డీ ఏ.సుందరిలను వివరణ కోరగా సమస్యను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తున్నామన్నారు.

నేటి నుంచి దండు మారెమ్మ జాతర



దండు మారెమ్మ అమ్మవారు, గణపవరం

గణపవరం: గణపవరం గ్రామ దేవత దండు మారెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈనెల 8వ తేదీన ప్రారంభం కానున్నాయి. ఈనెల 14వ తేదీ వరకూ ఈఉత్సవాలు జరుగనున్నాయి. ఉత్సవాల ప్రారంభమైన శనివారం అమ్మవారి గవళ్లగుడుపు సేవ అంగరంగ వైభవంగా జరుగుతుంది. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేస్తారు. అమ్మవారికి గరగల సేవ నిర్వహించి అమ్మవారిని గ్రామంలో రాత్రంతా పురవీధుల్లో ఊరేగిస్తారు. తీన్‌మార్ వాయిద్యాలు, బ్యాండు మేళాలు, కోలాట ప్రదర్శనలు, బుట్టబొమ్మలు, విచిత్రవేషాలు, శక్తివేషాలు, కేరళ డ్రమ్‌వాయిద్యాలు, కోరగేద నృత్యాలు, బాణసంచా మోతలు, విద్యుత్ దీప కాంతులు, అంభారీలతో అంగరంగ వైభవంగా అమ్మవారి గవళ్ల గుడుపు సేవ రాత్రి తెల్లవార్లు అట్టహాసంగా సాగుతుంది. గ్రామస్తులు తమ ఇంటి ముంగిటకు వచ్చిన అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి పూజలు చేస్తారు. తర్వాత అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా ప్రతీ రోజూ ఆలయం వద్ద గరగల నృత్యాలు, ఆసాదుల సేవలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఉత్సవాల ముగింపు రోజైన ఈనెల 16వ తేదీ ఆదివారం ఆలయంవద్ద అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని ఉత్సవ కమిటి తెలిపింది.

పట్టా రద్దుకు సిఫారసు

ఉంగుటూరు: గ్రామ పంచాయతీకి చెందిన 6 సెంట్లు స్థలాన్ని తన భార్యపేరు మీద రిజిస్టర్ చేసిన భూమిని రద్దు చేయాలని పంచాయతీ కార్యదర్శి విజయ్ తాడేపల్లిగూడెం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఎఫ్ఐఆర్ కాపీని జతచేసినట్లు కార్యదర్శి విజయ్ తెలిపారు. ఈ మేరకు పట్టారద్దు చేసినట్లు సమాచారం అందిందని తెలిపారు.

ఎంఆర్‌సీ కాలనీలో విజిలెన్స్ దాడులు

ఏలూరు(మెట్రో): పట్టణంలో విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్, పౌరసరఫరాలు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఎంఆర్‌సీ కాలనీలో చౌకడిపో 38ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ తహసీల్దార్ బి.కన్యాకుమారి మాట్లాడుతూ ఈ తనిఖీల్లో షాపు నెంబర్ 0581038లో బియ్యం, పంచదార, కందిపప్పు నిల్వల్లో వ్యత్యాసాలు గుర్తించామన్నారు. దీంతో డీలర్‌పై, ఆమె భర్తపైన నిత్యావసరాల వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో విజిలెన్స్ ఏఓ జి.మీరయ్య, ఎస్సై కె.సీ తారాము, ఆర్ఐ జె.శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ఉపాధ్యాయిలను సన్మానిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ టి కె విశ్వేశ్వరరావు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమని తెలిపారు. మహిళలను గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వాణిజ్యశాస్త్ర అధ్యాపకురాలు ఐ లావణ్య, ఆఫీస్ ఇంచార్జి గట్టు కల్యాణి, జూనియర్ సహాయకురాలు దుర్గ మ్మ, ధనలక్ష్మిలను సత్కరించి, బహుమతులు అందజేశారు. ఈ సమావేశంలో రెడ్డియ్య, డా. కొండరవి, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలపై వివక్ష దారుణం

గణపవరం: మహిళలు అన్నిరంగాలలో పురుషులతో సమానంగా పురోగమిస్తూ, అంతరిక్ష ప్రయాణాలు కూడా చేస్తున్న ఈరోజుల్లో కూడా మహిళల పట్ల వివక్ష, చిన్నచూపు తగదని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం గణపవరం మహిళా సాధికారత ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళలపై దాడులు, అత్యాచారాలు రోజురోజుకు పెరిగి పోతున్నాయని వీటిని అరికట్టడానికి ప్రభుత్వంతో పాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలన్నారు. మహిళలంతా చదువుకుని విద్యావంతులైతేనే మహిళాసాధికారత సాధ్యమన్నారు. ఈ సందర్భంగా గణపవరంలోని 20 మంది పేద మహిళలను సత్కరించి, వారికి చీరలు, పసుపుకుంకుమలు అందజేశారు. మహిళా అధ్యాపకులు, సిబ్బందిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మధురాజు, ఐక్యుసి కోఆర్డినేటర్ సీహెచ్ చైతన్య, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ స్వరూపరాణి, అధ్యాపకులు టి.అక్కిరాజు, జి.వెంకట్రావు, భాస్కరరావు, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో మహిళా దినోత్సవ వేడుకలు

దెందులూరు: ప్రతి ఒక్కరికి ప్రశాంత జీవనం స్వేచ్ఛ సమానత్వం శాశ్వతంగా ఉండాలని సాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్ మేజర్ సువర్ణ బాయ్ అన్నారు. శుక్రవారం దెందులూరు గొడ వీధిలోని సాల్వేషన్ ఆర్మీ మిలీనియం చర్చిలో ప్రపంచ ప్రార్థన దినోత్సవం, అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. తొలుత మహిళలందరికీ పూల కిరీటాలు పెట్టి సత్కరించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అన్ని రంగాల్లో మహిళలు పురుషులకు దీటుగా రాణించాలని పట్టుదల లక్ష్యం నిరంతర సాధనతోనే ఇది సాధ్యపడుతుందన్నారు.



గణపవరం డిగ్రీకాలేజీలో మహిళలను సత్కరించిన అధ్యాపకులు



చర్చిలో మహిళలను సత్కరిస్తున్న దృశ్యం